సాక్షి
ఖమ్మం
మంగళవారం । 29 । జూలై । 2025



ఇంటింటా జల్లెడ

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేలా ప్రత్యేక బృందాలతో ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తూనే ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. 8లో



.. విద్యార్థిని మృతి

గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఫిట్స్‌తో మృతి చెందగా కుటుంబీకులు, సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

మున్సిపోల్స్ ఎప్పుడో ?

జిల్లాలో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఓ వైపు గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి చర్చలు జరుగుతుండగా.. పురపాలికల ఎన్నికలకు కూడా మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆదేశాలు రాకున్నా ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా నిర్వహించేలా సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉండగా సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు జనవరిలో ముగిసింది. ఇక కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీలు నూతనంగా ఏర్పడడంతో వార్డుల విభజన కూడా పూర్తిచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవగానే మున్సిపోల్స్ కూడా ఉంటాయనే అభిప్రాయంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



మూడు చోట్ల ఆరు నెలల క్రితమే ముగిసిన పదవీకాలం

- కొత్తగా మరో రెండింటి ఏర్పాటు
- స్థానిక సంస్థలతో పాటు పురపాలికల్లోనూ ఎన్నికల హడావుడి
- ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా నిర్వహించేలా ఏర్పాట్లు

ఆ మూడింటికి ముగిసిన గడువు

జిల్లాలోని పాత మున్సిపాలిటీలైన సత్తుపల్లి, మధిర, వైరాలో ఈ ఏడాది జనవరి 26తో పాలకవర్గాల గడువు ముగిసింది. 2020 జనవరిలో ఈ మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో అన్నింటినీ బీఆర్ఎస్ గెలుచుకుంది. పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ మూడు చోట్ల కొత్త వార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు లేకపోవడంతో వచ్చే ఎన్నికలు సైతం పాత వార్డుల ప్రకారమే నిర్వహించనున్నారు. అయితే, రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యాన ఈసారి ఎన్నికల తీరు ఎలా ఉంటుందోనన్న చర్చ పార్టీల్లో మొదలైంది.

నూతనంగా మరో రెండు..

నూతనంగా ఏదులాపురం, కల్లూరు మున్సిపాలిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధాన కేంద్రాలతో పాటు సమీప గ్రామాలను విలీనం చేయగా.. వార్డుల విభజన సైతం పూర్తి చేశారు. దీంతో ఏదులాపురంలో 32, కల్లూరులో 20 వార్డులు ఖరారయ్యాయి. పాత మున్సిపాలిటీలతో పాటే ఈ రెండింటికీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఆదేశాలు రాకున్నా..

మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసి ఆరు నెలలు పూర్తయినందున పాత, కొత్త వాటికి ఒకే సారి ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఎలాంటి ఆదేశాలు రాకున్నా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి నేపథ్యాన వీటితోపాటు మున్సిపల్ ఎన్నికలు కూడా పూర్తి చేయాలనే భావనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిందనే చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే వార్డుల విభజన పూర్తిచేసి ఓటరు జాబితాలు, పోలింగ్ సామగ్రి సరిచూసుకోవడంలో నిమగ్నమైనట్లు సమాచారం.

పల్లె నుంచి పట్టణం దాకా..

రానున్న రెండు, మూడు నెలలు జిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కనుంది. గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతోపాటు మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్నందున అన్ని పార్టీల్లో కార్యకర్తల నుంచి నేతల వరకు వ్యూహప్రతివ్యూహాలకు పదును పెట్టనున్నారు. స్థానిక పోరు కావడంతో పల్లె నుంచి పట్టణం వరకు రాజకీయం రసకందాయంలో పడుతోంది. రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించే ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దనే భావనతో నాయకులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతలు ఇప్పటి నుంచే కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు మద్దతు ఇచ్చే కౌన్సిలర్లను గెలిపించుకోవాలంటే ఏం చేయాలనే దానిపై ఇప్పటినుంచే సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా	ఓటర్లు
సత్తుపల్లి	23	38,860	27,399
వైరా	20	31,056	23,675
మధిర	22	40,468	24,250
కల్లూరు	20	22,648	18,691
ఏదులాపురం	32	38,210	44,620
మొత్తం	117	1,71,242	1,38,635

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అజయ్



అజయ్ యాదవ్

కల్లూరు: కల్లూరు సబ్ కలెక్టర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి అజయ్ యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు డివిజన్‌ను ఇటీవల అప్‌గ్రేడ్ చేయగా 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అజయ్‌ను సబ్ కలెక్టర్‌గా నియమించిన విషయం విదితమే. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఇటావా జిల్లాకు చెందిన ఆయన ఢిల్లీ ఐఐటీలో బీటెక్ పూర్తిచేశాక సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఐఏఎస్ శిక్షణ అనంతరం కరీంనగర్‌లో ట్రెయినీ కలెక్టర్‌గా పనిచేయగా, తొలిపోస్టింగ్ కల్లూరులో కేటాయించారు. ఈ సందర్భంగా అజయ్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. తొలుత ఆయనకు ఆర్డీఓ రాజేందర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా



సీసీ రహదారులను పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న పథకాలను ఎన్ఎల్ఎం అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. ఉపాధి కూలీలు, మహిళా సంఘాల సభ్యులతో చర్చించడమే కాక రికార్డులను పరిశీలించారు. అలాగే, పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆపై అంగన్‌వాడీ కేంద్రాలు, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలు, సీసీ రహదారులను పరిశీలించి నిర్మాణ వివరాలపై అధికారులతో చర్చించారు. ఈ బృందంలో డాక్టర్ డీ.డీ.గరుడ, ఏ.అశ్విన్ గోపాల్ ఉండగా, ఈజీఎస్ ఏపీడీలు చలపతిరావు, శ్రీదేవి, డీఎల్‌పీఓ రాంబాబు, కూసుమంచి ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఏపీఓ అప్పారావు, ఏపీఎం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మరో 1,085 మెట్రిక్ టన్నుల యూరియా

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లా అవసరాల కోసం సోమవారం 1,085 మెట్రిక్ టన్నుల స్పిక్ యూరియా చేరింది. చింతకాని మండలం పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు యూరియాతో కూడిన గూడ్స్ రాగా, మార్క్‌ఫెడ్ గోదాములకు తరలించారు. ఇందులో 650 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్‌గా నిల్వ చేయనుండగా, మిగతా 435 మెట్రిక్ టన్నుల్లో 235 టన్నులు ఖమ్మం జిల్లాకు, 200 టన్నులు భద్రాద్రి కొత్తగూడెంకు కేటాయించారు. ఇక మంగళవారం కాంప్లెక్స్ 20:20 ఎరువుతో కూడిన రైలు, బుధవారం మరో 1,300 మెట్రిక్ టన్నుల క్రిబ్‌కో యూరియా రానుందని అధికారులు తెలిపారు.

ప్రకాష్‌నగర్ వంతెనపై పగుళ్లు..



ప్రకాష్‌నగర్ వంతెనపై పగుళ్లు వచ్చిన భాగం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నుంచి రాకపోకలకు ప్రధాన మార్గంగా మున్నేరుపై ఉన్న ప్రకాష్‌నగర్ వంతెన భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది మున్నేటికి వచ్చిన భారీ వరదతో వంతెనపై పలుచోట్ల స్ప్రింగ్లు కదలగా రాకపోకలు నిలిపేసి రూ.కోటి వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. అయితే, వంతనపై మళ్లీ పగుళ్లు వచ్చినట్లు తెలుస్తుండగా సోమవారం కొందరు వాహనదారులు తీసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో వంతెన భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వేర్ కోటింగ్‌లో ఏర్పడిన పగుళ్లే...

బ్రిడ్జిపై పగుళ్లు వచ్చాయనే సమాచారంతో ఆర్ అండ్ బీ డివిజన్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెనపై కనిపిస్తున్నవి కాంక్రీట్ లేదా స్ప్రింగ్లలో వచ్చిన పగుళ్లు కావని తేల్చిచెప్పారు. వంతెన శ్లాబ్ పైభాగంలో వేసే వేర్ కోటింగ్‌లో ఏర్పడిన అల్పస్థాయి పగుళ్లేనని, వీటితో వంతెనకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. అయినప్పటికీ మంగళవారం మరోసారి వేర్ కోటింగ్ చేయిస్తామని వెల్లడించారు.

పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత

- టెంపుల్, ఎకో టూరిజం ప్రాజెక్టులకు ప్రణాళికలు
- అధికారులతో సమీక్షలో మంత్రులు తుమ్మల, జూపల్లి



సమీక్షిస్తున్న మంత్రులు నాగేశ్వరరావు, కృష్ణారావు

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ప్రభావిత ప్రాంతాల ప్రజలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెంచేలా కార్యాచరణ రూపొందించేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు సోమవారం పర్యాటక ప్రాజెక్టులపై సమీక్షించారు. టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొనగా మంత్రులు మాట్లాడారు.

అపారమైన అవకాశాలు

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. పాలేరు రిజర్వాయర్, భద్రాచలం రామాలయం, పర్ణశాల, కిన్నెరసాని ప్రాజెక్టు, ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల పార్క్, వైరా రిజర్వాయర్, కనిగిరి హిల్స్, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం తదితర ప్రదేశాలకు వన్నెలద్ది వసతులు కల్పిస్తే పర్యాటకుల రాక పెరుగుతుందని చెప్పారు. అంతేకాక టెంపుల్, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించినట్లవుతుందని తెలిపారు. ఖమ్మం సమీపాన సుమారు 500 ఎకరాల అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి పనులు వేగవంతం చేయడమే కాక కొత్తగూడెం హరిత హోటల్‌ను పూర్తిచేసి ఖమ్మంలోనూ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం లేదా ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు చేపట్టే అవకాశముందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యాన పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేయాలని తుమ్మల, జూపల్లి కృష్ణారావు సూచించారు.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు..

గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డే(ప్రజావాణి)లో భాగంగా వారు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఏ ఫిర్యాదు పెండింగ్ ఉండకుండా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఏవైనా తిరస్కరిస్తే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలియచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- బోనకల్‌కు చెందిన జె.శైలు, ఎర్రుపాలెంకు చెందిన జి.అరుణ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు.
- ముదిగొండ మండలం వల్లభి మాజీ సర్పంచ్ బి.బిక్షం తమ గ్రామ గ్రంథాలయ అభివృద్ధిపై దృష్టి సారించి భవనానికి నిధులు మంజూరు చేయాలని, పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు సమకూర్చాలని కోరారు.
- ఖమ్మం నుంచి ముదిగొండ మీదుగా, వల్లభి, జగ్గయ్యపేట వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

- కారేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కలెక్టర్ అనుదీప్
- పీహెచ్‌సీ, సొసైటీ గోదాంల్లోనూ తనిఖీ



విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబడుతున్న కలెక్టర్ అనుదీప్


కారేపల్లి: చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని.. తద్వారా గౌరవం లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించి క్రమశిక్షణతో పట్టుదలగా చదవాలని సూచించారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా పరిశీలించిన ఆయన పలుచోట్ల చెత్త పేరుకుపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, పుస్తకాలు, విద్యార్థుల యూనిఫామ్, క్రీడా సామగ్రి నిల్వ ఉంచే గదుల్లోనూ శుభ్రత లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు సూచనలు చేసిన కలెక్టర్ పలు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతూ వారి ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, మధ్యాహ్న భోజనం నాణ్యతపైనా ఆరా తీశారు. అనంతరం కారేపల్లి పీఏసీఎస్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ఎరువుల లభ్యత, సరఫరా ఆరా తీశాక సిబ్బందికి సూచనలు చేశారు. అక్కడి నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్ అనుదీప్.. పలువురితో మాట్లాడి అందుతున్న వైద్యసేవలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు కృషి చేయాలని, సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి సారించాలని ఆదేశించారు. తహసీల్దార్ అనంతుల రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంఈఓ జయరాజు, హెచ్ఎం శ్యాంప్రసాద్, ఏఓ భట్టు అశోక్‌కుమార్, వైద్యాధికారి బి.సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్, సొసైటీ సీఈఓ బి హన్మంతరావు పాల్గొన్నారు.

నాణ్యమైన గేదెల కొనుగోలు

ఖమ్మంవ్యవసాయం: మధిరలో ఏర్పాటుచేసే ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులతో నాణ్యమైన, ఆరోగ్యవంతమైన గేదెలే కొనుగోలు చేయించాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. అధిక పాల దిగుబడి వచ్చే రకాలు ఎంపిక చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఏపీలోని తుని, తణుకు, ఉండి, కంకిపాడు తదితర సంతల్లో అధికారులు పరిశీలించి మొదటి విడతగా 250 గేదెల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ బృందంలో 25 మంది లబ్ధిదారులు, నలుగురు అధికారులు వెళ్లాలని తెలిపారు. ఈసమావేశంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ పురందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వీ.మధుసూదన్, ఏడీఏ విజయచందర్, ఎఫ్‌డీఓలు మంజుల, వెంకన్న పాల్గొన్నారు.

విలువలను కాలరాస్తున్న బీజేపీ

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం


ముదిగొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే కాక ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డం పెట్టుకుని వ్యవస్థలను నాశనం చేస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ముదిగొండలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ హయాంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. ఈమేరకు ప్రజల హక్కులను కాపాడే బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. కాగా, రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తమ్మినేని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ జోక్యాన్ని అరికట్టి అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భూ పోరాటం చిరస్మరణీయం

ముదిగొండ భూపోరాటం చిరస్మరణీయమైనదని తమ్మినేని వీరభద్రం తెలిపారు. భూపోరాటంలో భాగంగా పోలీసుల కాల్పుల్లో మరణించిన వారి వర్ధంతి సభ సోమవారం నిర్వహించగా తమ్మినేని మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మడుపల్లి గోపాలరావు, భట్టు పురుషోత్తం, బండి పద్మ, మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, వేల్పుల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, మండరపు పద్మావతి, పయ్యావుల ప్రభావతి, మేడ నారాయణ, భట్టు రాజు, దస్తగిరి, మెట్టెల సతీష్, కట్టకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

దంపతులతో దాగుడుమూతలు

- సంతానం లేని వారే లక్ష్యంగా దందా
- విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న సంతాన సాఫల్య కేంద్రాలు
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా నిర్వహణ
- అమాయకుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్న యాజమాన్యాలు



సంతాన సాఫల్యతకు ఇవీ మార్గాలు

- **ఐయూఐ (ఇంట్రా యుటిరిన్ ఇన్‌సెమినేషన్) :** ఈ విధానంలో భర్త శుక్రకణాలను సేకరించి కదలిక మంచిగా ఉన్న వాటిని సిరంజీ ద్వారా భార్య గర్భసంచిలోకి ప్రవేశపెడతారు.
- **ఐవీఎఫ్ (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) :** ఇందులో మహిళ అండాన్ని ల్యాప్రోస్కోపిక్ ద్వారా తీసి ప్రిజర్వ్ చేస్తారు. ఆపై భర్త వీర్యకణాలు తీసి బయటే అండం, శుక్రకణాలను ఫలదీకరణం చేశాక అండాలను గర్భసంచిలో ప్రవేశపెడతారు.
- **సరోగసీ :** భార్య గర్భం దాల్చే అవకాశం లేదని తేలినప్పుడు ఈ విధానం ఎంచుకుంటారు. భర్త శుక్రకణాలు, భార్య అండాలను ఫలదీకరించి మరో మహిళ గర్భంలో ప్రవేశపెడతారు. ఈ విధానంలో చికిత్స చేసే ఆస్పత్రులకు జిల్లా స్థాయి కమిటీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి జిల్లాలో సంతాన సాఫల్య కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. ప్రస్తుత జీవనశైలి, వాతావరణ పరిస్థితులతో పాటు ఇతర కారణాలతో సంతాన లేమి సమస్య ఎదురవుతుండగా.. పిల్లలు లేని జంటలే లక్ష్యంగా కేంద్రాల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. ఆతర్వాత ఫలితం లేకపోతే తమ తప్పేం లేదని చేతులు దులుపుకుంటుండడం దంపతులు కన్నీటికి కారణమవుతోంది. అయితే, కేంద్రాల ఏర్పాటుకు కొందరే అనుమతి తీసుకుంటుండగా.. అనుమతులు లేనివి లెక్కలేనన్ని పుట్టుకొస్తుండడం గమనార్హం.

పదింటికే అనుమతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు, ఖమ్మం జిల్లాలో ఏడు సంతాన సాఫల్య కేంద్రాలకు వైద్య, ఆరోగ్య శాఖ అనుమతి ఉంది. ఖమ్మం జిల్లాలో రోహిత్ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్, ప్రవీణ ఫెర్టిలిటీ సెంటర్, మాతృశ్రీ ఫెర్టిలిటీ సెంటర్, శ్రీగర్భ ఫెర్టిలిటీ సెంటర్, శ్యామల హాస్పిటల్, వింగ్స్ జోయా ఐవీఎఫ్ సెంటర్, కార్తీక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు అనుమతి ఉండగా.. ఇందులో రోహిత్, ప్రవీణ సెంటర్లకు సరోగసీ అనుమతులు ఉన్నాయి. కానీ ఉమ్మడి జిల్లాలో ముప్పైకి పైగా సెంటర్లు కొనసాగుతుండడం అధికారుల పర్యవేక్షణ లేమిని తెలియజేస్తోంది.

మరిచిపోయారా?

గత ఏడాది మార్చిలో సంతాన సాఫల్య కేంద్రాల తీరుపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఖమ్మంలోని సెంటర్లలో హైదరాబాద్ అధికారులు తనిఖీ చేపట్టారు. అప్పుడు రెండు ఫెర్టిలిటీ సెంటర్లను సీజ్ చేయడమే కాక ఐదు టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఆతర్వాత రాష్ట్ర, జిల్లా అధికారుల తనిఖీ లేకపోవడంతో దందా అడ్డూఅదుపు లేకుండా కొనసాగుతోంది.

కమీషన్లతో వ్యవహారం

వివాహం జరిగి ఏళ్లు గడిచినా సంతానం లేని దంపతులే టార్గెట్‌గా నిర్వాహకులు దందా సాగిస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్, టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వంటి పేర్లతో ఏర్పాటుచేస్తున్న కేంద్రాల్లో చికిత్స చేయించుకుంటే బిడ్డ జన్మించడం గ్యారంటీ అని నమ్మిస్తూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. అనుమతి ఉన్నవేవో, లేనివేవో తెలియక సూర్యాపేట, మహబూబాబాద్‌తో పాటు తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్, ఏపీలోని పలు జిల్లాల నుంచి దంపతులు సంతానంపై ఆశతో వస్తున్నారు. దంపతులను పంపిస్తే ఆర్ఎంపీలు, వైద్యులకు కమీషన్లు ఇచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు సమాచారం.


అతి తక్కువ 'సక్సెస్ రేట్'

దంపతుల్లో సంతాన లేమికి అనేక కారణాలు ఉంటాయి. దంపతులెవరైనా సంతానం లేదని వస్తే వైద్యులు అందుకు కారణాలను నిర్ధారించి వివరించాల్సి ఉంటుంది. కానీ చికిత్స చేస్తే సంతానం గ్యారంటీ అని నమ్మబలికి వసూళ్లు మొదలుపెడుతున్నారు. దీంతో అటు కుటుంబం, ఇటు సమాజం నుంచి సూటిపోటి మాటలు భరిస్తున్న దంపతులు ఆస్తులు అమ్మి మరీ చెల్లిస్తున్నారు. కాగా, టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లలో 10 – 15 శాతమే సక్సెస్ రేట్ ఉంటుందని నిపుణులు చెబుతుండగా.. సెంటర్ల నిర్వాహకులు ఆదాయమే లక్ష్యంగా చికిత్స కొనసాగిస్తున్నారని సమాచారం.

హైదరాబాద్ ఘటనతో సందేహాలు

హైదరాబాద్‌లోని ఓ ఫెర్టిలిటీ సెంటర్‌లో దంపతులను మోసగించిన ఘటన ఇటీవల బయటపడింది. సరోగసీ పేరుతో ఇతరులకు పుట్టిన శిశువును అప్పగించిన వైద్యురాలి మోసం బయటపడగా.. ఆ సెంటర్‌కు లైసెన్సే లేనట్లు తేలింది. ఈ నేపథ్యాన ఉమ్మడి జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లలో జరుగుతున్న చికిత్సపై సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. చాలా సెంటర్లు అనుమతి లేకున్నా కొనసాగుతుండడంపై అధికారుల నిర్లక్ష్యాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఫెర్టిలిటీ సెంటర్లలో నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తప్పవు. అమాయకులైన దంపతులకు హానీ కలిగించేలా వ్యవహరించొద్దు. అనుమతి ఉన్న సెంటర్ల నిర్వాహకులైనా నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. జిల్లాలోని అన్ని సెంటర్లను తనిఖీ చేసి నిబంధనల అమలును పరిశీలిస్తాం.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

ఖాళీల లెక్క తేలింది...

జిల్లాలో టీచర్ పోస్టులు 892ఖాళీ

ఖమ్మం సహకారనగర్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యాన ఈనెల 31వ తేదీన పలువురు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు ఉద్యోగ విరమణ చేయనుండగా విద్యాశాఖ అధికారులు ఖాళీల లెక్క తేల్చేలా కసరత్తు ఆరంభించారు. జిల్లాలో మొత్తం 5,816 పోస్టులకు గాను 4,924మంది విధులు నిర్వర్తిస్తుండగా 858 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇటీవల ప్రకటించగా, ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న వారితో కలిసి ఆ సంఖ్య 892కి చేరింది. కాగా, పదోన్నతుల షెడ్యూల్ మంగళవారం విడుదలయ్యే అవకాశముందని సమాచారం. షెడ్యూల్ ప్రకారం సీనియారిటీ ఆధారంగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఉషా టోర్నీలో పతకాలు



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలోఇండియా ఉషా పోటీల్లో జిల్లాక్రీడాకారులు మూడు పతకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో పి.పవిత్రాచారికి స్వర్ణపతకం సాధించగా, ఇతర ఈవెంట్లలో డి.హర్షిణి రజతం, టి.సాయి భవ్యశ్రీకి కాంస్య పతకం దక్కించుకున్నారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి సోమవారం అభినందించారు.

సస్యరక్షణ చర్యలే కీలకం



పెసర పంట పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కొణిజర్ల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు తగిన సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో పత్తి, పెసర పంటలను సోమవారం పరిశీలించిన ఆయన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిలిచి పత్తికి వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశమున్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్‌ను తెగులు సోకిన మొక్కల చుట్టూ పిచికారీ చేయాలన్నారు. అలాగే, ఎకరాకు 25కిలోల యూరియా, 20 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, రసాయన ఎరువులను పైపాటుగా మొక్కల మొదళ్లకు 7 – 10 సెం.మీ. దూరాన చల్లాలని తెలిపారు. అలాగే, పూత దశలో ఉన్న పెసరలో ఆకు మచ్చ తెలుగు, పల్లాకు తెగులు, ఎల్లో మొజాయిక్ తెగులు సోకుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ డి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్‌తండా వాసికి డాక్టరేట్



ఉపేందర్‌రావు

కారేపల్లి: కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ ఉపేందర్‌రావుకు తమిళనాడులోని చిదంబరం అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. జనగామ జిల్లా కేంద్రంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రొఫెసర్లు ఎస్.కన్నప్పన్, ఎల్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు.

పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాకేష్



తేలే రాకేష్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన తేలే రాకేష్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. 2014నుంచి పీవైఎల్‌లో కొనసాగుతున్న రాకేష్ నగర కోశాధికారిగా, డివిజన్ కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను పలువురు అభినందించారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న నేపథ్యాన రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లలో వేగం పెంచింది. ఈమేరకు తుది ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించారు. ఇప్పటికే రెండు మార్లు ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి ఎంపీడీఓల లాగిన్ ద్వారా టీపోల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. ఇది జరిగి ఆరు నెలలు గడిచినందున వార్డుల సంఖ్య పెరగడం లేదా తగడం, ఓటర్లలో మార్పులు, చేర్పులు జరగనున్నందున మరోమారు పరిశీలించాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలతో గ్రామ కార్యదర్శులు పరిశీలిస్తున్నారు. ఈ ఆరు నెలల కాలంలో మృతి చెందిన వారి పేర్లు తొలగించడంతో పాటు కొత్తగా అర్హత సాధించిన వారి పేర్లు నమోదు చేస్తారు. ఈ కారణంగా జాబితాలో క్రమ సంఖ్య మారనుంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,900	5,200
కందులు	6,200	6,200
ఏసీ మిర్చి	13,900	8,000
ఏసీ మిర్చి తాలు	7,800	7,050
మిర్చి	8,500	5,300
పత్తి	7,950	6,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

ఇంటింటా జల్లెడ

- జిల్లాలో మొదలైన ఫీవర్ సర్వే
- జ్వరం వచ్చిన వారికి చికిత్స.. మిగతా వారికి పరీక్షలు
- మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- సీజనల్ వ్యాధుల కట్టడికి కార్యాచరణ





ఖమ్మం వైద్యవిభాగం: సర్వేలో భాగంగా పరీక్షిస్తున్న డీఐఓ చందూనాయక్, (ఇన్‌సెట్) రఘునాథపాలెం : తాగునీటి ట్యాంకులో క్లోరిన్ కలుపుతున్న సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం/రఘునాథపాలెం/సత్తుపల్లి టౌన్: జిల్లాలో వారం పాటు కురిసిన వర్షాలతో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడగా.. దోమలు వృద్ధితో సీజనల్ వ్యాధులు ప్రబలుతుతున్నాయి. జిల్లాలోని తల్లాడ, తిరుమలాయపాలెం, బోనకల్‌తో పాటు ఖమ్మంలోనూ డెంగీకేసులు నమోదైన నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇంటింటా సర్వే ద్వారా వ్యాధుల కట్టడికి నిర్ణయించగా.. ఈనెల 27వ తేదీ నుండి ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. సెప్టెంబర్ చివరి వరకు సాగే ఈ సర్వే కోసం అదనపు కలెక్టర్ శ్రీజ 12 మందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.ఈబృందాలు నిరంతరం వారికి కేటాయించిన మండలాల్లో సర్వేను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

ఏం చేస్తారు?

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే కాక జ్వరం వచ్చిన వారికి చికిత్స అందేలా ఆయా బృందాలు పర్యవేక్షిస్తారు. అంతేకాక జ్వరబాధితుల ఇళ్లలోని అందరి నుంచి రక్తనమూనాలు సేకరిస్తారు. సాధారణ జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడే వారికి మందులు ఇవ్వడంతో పాటు డెంగీ వంటి లక్షణాలు ఉంటే నిర్ధారించాక ఆస్పత్రులకు తరలిస్తారు. అలాగే, గ్రామాల్లో ఫాగింగ్ చేయించడం.. మురికి గుంతల్లో టీమోఫాస్ స్ప్రే, ఆయిల్ బాల్స్ వేయిస్తూ జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నచోటట వైద్య శిబిరాలు ఏర్పాటుచేయిస్తారు.

12 మంది అధికారులు

జిల్లాలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టేలా నిర్వహిస్తున్న సర్వే పర్యవేక్షణకు 12మంది ప్రత్యేక అధికారులను నియమించారు. వీరు వ్యాధుల సీజనల్ ముగిసే వరకు క్షేత్ర స్థాయిలో ఉండి మండల స్థాయి బృందాలు చేపట్టే సర్వేను పర్యవేక్షిస్తూనే ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈమేరకు డీఐఓ చందూనాయక్‌కు మూడు మండలాలు కేటాయించగా, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, వ్యాక్సిన్ మేనేజర్ వెంకటరమణ, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓలు జీ.వీ.సత్యనారాయణ, టి.రాంబాబు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారామ్‌కు రెండు చొప్పున, జిల్లా క్షయ నివారణ అధికారి వి.సుబ్బారావు, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌కు ఒక్కో మండల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ అదనపు కలెక్టర్ శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు.

డెంగీ కేసుల నమోదుతో...

గత ఏడాది జిల్లాలో 529 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది కేసులు రావొద్దని అధికారులు ముందు నుంచి అప్రమత్తంగా ఉన్నారు. అయినా పలు ప్రాంతాల్లో కేసులు వస్తుండడం.. తల్లాడలో ఓ మహిళ మృతి చెందడంతో అధికారులు అప్రమత్తమై క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే నిర్వహణకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం జిల్లాలో 20 వరకు డెంగీ కేసులు నమోదు కాగా.. మరింత వ్యాప్తి చెందకుండా కట్టడి చేసేలా కార్యచరణ రూపొందించారు. ఈక్రమంలోనే ఇంటింటి సర్వే ద్వారా ఇళ్లలోని పాత సామగ్రిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమల నివారణకు మెష్‌లు అమర్చేలా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక కాచి చల్లార్చిన నీరే తాగాలని, వేడివేడి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నారు.

ఫీవర్ సర్వే తప్పనిసరి...



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష

కొణిజర్ల: ఇంటింటా ఫీవర్ సర్వేపై శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సూచించారు. కొణిజర్ల పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేసిన ఆమె రికార్డులు పరిశీలించాక సిబ్బందికి సూచనలు చేశారు. ఇంటింట ఫీవర్ సర్వే ద్వారా జ్వర బాధితులను గుర్తిస్తే సత్వరమే చికిత్స అందించే వీలు ఉంటుందని తెలిపారు. రహదారుల వెంట, డ్రెయినేజీల్లో నిలిచిన మురుగునీటినిశుభ్రం చేయించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేలా ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఆర్.ఉపేంద్రయ్య, వైద్యాధికారి సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ..



సీజనల్ వ్యాధుల నియంత్రణకు కార్యాచరణ రూపొందించాం. ప్రతిరోజూ ఆరోగ్య బృందాలతో జ్వర సర్వే, డ్రై డే చేపడుతున్నాం. దోమల నియంత్రణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– టి.సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సత్తుపల్లి

షటిల్ కోర్టులో గుండెపోటు

కుప్పకూలి మృతి చెందిన తల్లాడ యువకుడు



అకాడమీలో పడిపోయిన రాకేష్, (ఇన్‌సెట్) రాకేష్ (ఫైల్)

తల్లాడ/ఉప్పల్: రోజులాగే షటిల్ ఆడుతున్న యువకుడు గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడైన రాకేష్(25) డిగ్రీ పూర్తి చేశాక హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నివాసముంటూ అక్కడి ఓ కార్ల షోరూంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. చిన్నతనం నుంచే షటిల్‌పై మక్కువ పెంచుకున్న ఆయన నిత్యం సాధన చేసేవాడు. ఇందులో భాగంగానే రోజులగా హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లోని అల్లైట్ బ్యాడ్మింటన్ అకాడమీలోఆదివారం రాత్రి షటిల్ ఆడుతుండగా.. 20 నిమిషాల ఆట అనంతరం రాకేష్ ఉన్నట్టుండి కుప్ప కూలాడు. దీంతో సహచరులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తల్లాడలో విషాదం

రాకేష్ మృతదేహానికి హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం తల్లాడ తీసుకొచ్చారు. కాగా, ఆయన షటిల్ ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌కాగా.. రాకేష్‌కు నివాళుర్పించేందుకు హైదరాబాద్, తల్లాడ నుంచి స్నేహితులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. తమతో పాటు షటిల్ ఆడిన ఆయన గుండెపోటుతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేని స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించడమే కాక 'మేం కూడా నీతోనే వస్తాం' అంటూ రోదించడం అందరికీ కంటతడి పెట్టించింది.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- పరీక్ష రాస్తుండగా ఫిట్స్, ఆస్పత్రికి తరలించగా కన్నుమూత
- న్యాయం చేయాలంటూ బంధువులు, సంఘాల నాయకుల ధర్నా



భూక్యా ప్రతిమ (ఫైల్)



విద్యార్థి సంఘాల నాయకులను పక్కకు తప్పిస్తున్న పోలీసులు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి గొల్లగూడెంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థిని భూక్యా ప్రతిమ(15) సోమవారం మృతి చెందింది. కూసుమంచి మండలం బోడియాతండా గ్రామపంచాయతీ నామతండాకు చెందిన భూక్యా రమేష్ – బూబమ్మ కుమార్తె ప్రతిమ పదో తరగతి చదువుతోంది. మధ్యాహ్నం ఆమె ఎఫ్ఏ-1 సోషల్ పరీక్ష రాస్తుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలలోని ఏఎన్ఎంతో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే ప్రతిమ మృతి చెందింది.

న్యాయం చేయాలని ధర్నా

ప్రతిమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మార్చురీకి తరలిస్తుండగా బంధువులు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కుమార్తె ఎలా చనిపోయిందో చెప్పాలంటూ ప్రతిమ తండ్రి రమేష్ స్ట్రెచర్‌కు అడ్డుగా పడుకున్నాడు. అంతలోనే విద్యార్థి సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆస్పత్రికి తరలించడంలో ఆలస్యంతోనే విద్యార్థిని మృతి చెందిందంటూ ఆందోళన చేపట్టారు. ఆమె కుటుంబానికి న్యాయం చేసే వరకు కదిలేది లేదని బైఠాయించగా పోలీసులు వారికి పక్కకు తొలగించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్‌డీఓ నర్సింహారావు అక్కడికి చేరుకుని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి బంధువులకు హామీ ఇచ్చారు.

పాఠశాలలో డీడీ విచారణ

విద్యార్థి ప్రతిమ మృతి నేపథ్యాన గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి ఆశ్రమ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఉదయం నుంచి విద్యార్థిని ఎలా ఉందో ఆరా తీసిన ఆమె అక్కడి నుంచి ఆస్పత్రికి వచ్చి బంధువులతో మాట్లాడారు. అయితే, ఆస్పత్రిలో ప్రతిమను చేర్పించిన ఉపాధ్యాయులు అక్కడ లేకపోవడంపై బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ కార్యాలయంలో కాపర్ వైరు మాయం

ఖమ్మంవ్యవసాయం: ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లే ఘటనలు వెలుగు చూస్తుండగా.. ఈసారి ఏకంగా విద్యుత్ కార్యాలయం నుంచే వైరు మాయవడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మంలోని ఎంఆర్‌టీ(మీటర్ రిలే టెస్టింగ్) డివిజన్ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్లలో వినియోగించే కాపర్ వైరు నిల్వ చేయగా.. మూడు క్వింటాళ్ల వైరు తక్కువగా ఉందని అధికారులు రెండు రోజుల క్రితం గుర్తించారు. ఈ వైర్ విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలుస్తోంది. కార్యాలయం తాళాలు పగలగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లి ఉంటారనే అనుమానంతో ఎంఆర్‌టీ డివిజన్ అధికారులు ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారికి సమాచారం ఇచ్చారు. ఈ విషయమై ఎంఆర్‌టీ డివిజన్ డీఈ భద్రుపవార్‌ను వివరణ కోరగా కాపర్ వైర్ తక్కువగా ఉందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే, ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖలో రకరకాలుగా చర్చ జరుగుతోంది. ఇంటి దొంగల పనే కావొచ్చని కొందరు చెబుతుండడం గమనార్హం.

రామయ్యకు వెండి శఠారి



ఈఓకు శఠారి అందిస్తున్న దాతలు

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన సంకా రామచంద్రమూర్తి – శశిదేవి దంపతులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి అలంకరణ కోసం రూ.60 వేల విలువైన 485 గ్రాముల వెండి శఠారిని సోమవారం ఈఓ రమాదేవికి అందజేశారు.

వైరా నదిలో మృతదేహం లభ్యం

మధిర: మండలంలోని అంబారుపేటకు చెందిన దంతాల రామకృష్ణ(45) మృతదేహం వైరానదిలో సోమవారం బయటపడింది. తాపీ మేస్త్రీగా పనిచేసేఆయన కుటుంబ కలహాల నేపథ్యాన ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదేరోజు ఇల్లందులపాడు సమీపాన ప్రవహిస్తున్న నీటిలోదూకగా.. వరద ప్రవాహంతో కొట్టుకుపోయి వైరా నదిలో మృతదేహమైతేలినట్లు భావిస్తున్నారు. ఆయనకు భార్య ఉండగా, ఈనెల 24నే రామకృష్ణ ఆచూకీ కనిపించడం లేదని మధిరలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు.

ఖమ్మం వాసికి డెంగీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం టీఎన్జీవోస్ కాలనీ వాసి ఒకరు డెంగీ బారిన పడ్డాడు. కాలనీకి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇటీవల తీవ్ర జ్వరం రావడంతో ఖమ్మంలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చిన ఆయన ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా డెంగీ నిర్ధారణ అయింది. ఈమేరకు వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన డాక్టర్ సుబ్బారావు, కేఎంసీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మన్సన్ తదితరులు బాధితుడి నివాసానికి వెళ్లి వివరాలు ఆరా తీయడమే కాక చుట్టుపక్కల ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే, చుట్టూ 60 ఇళ్లలోని వారికి రక్తపరీక్షలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అనంతరం డాక్టర్ సుబ్బారావు కేఎంసీలోని మలేరియా అధికారి కార్యాలయానికి వెళ్లి గతంలో ఏయే ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయో వివరాలు ఆరా తీశారు.

రెండు చోట్ల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు సోమవారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం చెరువు బజార్‌కు చెందిన దుర్గిరాల సూర్యనారాయణ, గెంటెల నరేష్, ఆంజనేయశర్మ, దోనకొండ జాను ఒడిశాలో గంజాయి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. సీక్వెల్ రిసార్ట్స్ వద్ద తమ్మిశెట్టి గురవయ్య, చల్లా గోపి, ఇసంపల్లి దిలీప్‌కుమార్‌కు విక్రయించేందుకు యత్నిస్తుండగా వారి నుంచి 1.5కేజీల గంజాయి, ఆటో, రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఖమ్మం వన్ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అలాగే, ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన సాయిరామ్, సాధిక్ పాషా వైఎస్సార్ కాలనీకి చెందిన రాము నుంచి 100గ్రాముల గంజాయి కొనుగోలు చేసి సారధినగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద పీలుస్తుండగా టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ మోసగాళ్ల టోకరా

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో మరో సైబర్ మోసం వెలుగు చూసింది. బెంగళూరునుంచి ఫోన్ చేస్తున్నామంటూ సైబర్ నేరగాళ్లు రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి కొంతనగదు డ్రా చేసుకున్నారు. ఖమ్మం గొల్లగూడెంకు చెందిన 62ఏళ్ల రిటైర్డ్‌ఉద్యోగికి గత నెలలో గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. బెంగళూరు నుంచి మాట్లాడుతున్నామని చెప్పిన వారు 'మీరు అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారు' అని బెదిరించి బాధితుడి కెనరా బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించారు. ఆ వెంటనే రూ.38వేలు డ్రా చేసుకోగా సదరు రిటైర్డ్ ఉద్యోగి 1930 నంబర్‌కు ఫోన్ చేయడంతో మిగతా నగదు డ్రా కాకుండా అడ్డుకున్నారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

బైక్ ఢీకొని విద్యార్థికి గాయాలు

బోనకల్: మండలంలోని జానకీపురానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థి మిట్టపల్లి ప్రజ్ఞామనోహరికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఆమె బోనకల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతుండగా, సోమవారం సాయంత్రం స్కూల్ బస్సు దిగి రోడ్డు దాటే క్రమాన వైరా నుంచి బోనకల్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మనోహరికి 108 సిబ్బంది కోటా భానుహాసన్, మిథున్ చక్రవర్తి ప్రథమ చికిత్స చేశాక ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగాల పేరిట టోకరా

పలువురి వద్ద రూ.4లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు వసూళ్లు



ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్ వద్ద బాధితులు

ఖమ్మంక్రైం: ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్న తనకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో అందరూ తెలుసునని నమ్మించిన ఓ వ్యక్తి స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో వసూలు చేసిన ఘటన వెలుగు చూసింది. ఖమ్మం కవిరాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన అనిల్ కొన్నేళ్ల క్రితం తన పేరు కేతన్ అని, ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్నానంటూ ఖమ్మంతో పాటు ములుగు జిల్లా వాజేడు ప్రాంతానికి చెందిన పలువురితో పరిచయం పెంచుకున్నాడు. ఈక్రమాన వాజేడు ప్రాంత మహిళకు మొదట ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పించాడు. ఈ విషయాన్ని ప్రచారం చేసుకోవడమే కాక ఆ మహిళ ద్వారా మరికొందరితో పరిచయం పెంచుకున్నాడు. నిరుద్యోగుల బలహీనతను ఆసరాగా చేసుకున్న ఆయన వైద్య, ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి రూ.4లక్షల నుంచి రూ.5లక్షల మేర వసూలు చేశాడు. అయితే, నెలలు గడిచినా ఉద్యోగాలు రాకపోగా అనిల్ ఇంటికి వెళ్లి అడితే కుటుంబీకులు తమకు సంబంధం లేదని బదులిచ్చారు. దీంతో చేసేదేం లేక బాధితుల్లో కొందరు సోమవారం ఖమ్మం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. కాగా, బాధితుల్లో ఎక్కువ మంది గిరిజనులే ఉండగా.. విచారణ చేస్తున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే మరోసారి...



కోనాయిగూడెంలో లబ్ధిదారురాలి ఫొటో తీస్తున్న కార్యదర్శి దినేష్‌కుమార్

ఈసారి కేంద్ర ప్రభుత్వం యాప్‌లో నమోదు

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసేందుకు మరోమారు సర్వే చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారుల వివరాల నమోదుకు కేంద్రప్రభుత్వం యాప్‌ను రూపొందించింది. లబ్ధిదారులకు ఇస్తున్న రూ.5లక్షల్లో కేంద్రం వాటా కూడా ఉండగా.. యాప్‌లో నమోదు చేస్తేనే నిధులు విడుదలవుతాయని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సర్వే మొదలుపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని 13వేల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను 40ప్రశ్నల ద్వారా సేకరించి పీఎంఏజీవై యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఒక్కో ఇంటి వద్ద వివరాల సేకరణకు దాదాపు అర గంటకు పైగా సమయం పడుతుండగా.. ఇంటి వద్ద ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే, సోమవారంతో సర్వే ముగించాలని ఆదేశించగా సాంకేతిక కారణాలతో సాధ్యం కాలేదని సమాచారం. ఈనెల 31వరకు సమయం ఇస్తేనే సర్వే పూర్తవుతుందని కార్యదర్శులు చెబుతున్నప్పటికీ అప్పటివరకు యాప్ లాగిన్ ఉంటుందా, లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే, జిల్లాలో సర్వే దాదాపు పూర్తి కావొచ్చిందని గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఐదుగురిలో నలుగురు కుమార్తెలు

పోషించలేక ఇద్దరిని దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు

వైరారూరల్: వైరా మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు మూడేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమార్తెలను దత్తత ఇచ్చినట్లు అందిన ఫిర్యాదుతో పోలీసులు సోమవారం విచారణ చేపట్టారు. కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించే దంపతులు ఆడపిల్లలను దత్తత ఇచ్చారంటూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో వారు ఇచ్చిన సమాచారంతో వైరా ఎస్సై పుష్పాల రామారావు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన బధిరుడైన వ్యక్తి తొమ్మిదేళ్ల క్రితం సత్తుపల్లి మండలానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి మొదటి, రెండో కాన్పులో కుమార్తెలు జన్మించగా, మూడో సంతానంగా అబ్బాయి జన్మించినా అనారోగ్యంతో మృతిచెందాడు. ఆపై 2023 మే నెలలో జన్మించిన కుమార్తెను మూడు నెలల వయస్సులో నాగార్జునసాగర్ వాసులకు, 2024 డిసెంబర్‌లో జన్మించిన ఇంకో కుమార్తెను తొమ్మిది రోజుల వయస్సులో గుంటూరులోని దంపతులకు దత్తత ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో విచారణ చేపట్టగా ఆడపిల్లలను విక్రయించినట్లు ఆధారాలేమీ లేవని తేల్చారు. అయితే, కుమార్తెలను పోషించలేక దత్తత ఇచ్చినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగలేదని గుర్తించారు.